క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి

జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

విశాలాంధ్ర-శృంగవరపుకోట/విజయనగరం : షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని షటిల్ బ్యాడ్మింటన్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఆకాంక్షించారు. విజయనగరం లోని జమ్ము గ్రామం సమీప పడాలపేటలో గల ఎపిక్ బాడ్మింటన్ స్టేడియంలో జిల్లాస్థాయి అండర్-11, 13 %డ% 15 బాలురు, బాలికల ఛాంపియన్ షిప్ పోటీలు-కమ్-సెలక్షన్స్ ను ఎమ్మెల్సీ, జిల్లా షటిల్ బాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు ఇందుకూరి రఘురాజు ఇందుకూరి సుధారాజు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులనుద్దేశించి ఎమ్మెల్సీ మాట్లాడుతూ క్రీడాకారులు నిత్యం సాధన చేసి నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తితో గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. క్రీడాకారులు జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని, లక్ష్యాన్ని ఛేదించాలనే తపన ఉంటే చాలన్నారు. ఆత్మస్థైర్యం పెరగడంతో పాటు విజయాలు వాటంతట అవే ముందుకు వచ్చి చేరతాయని పేర్కొన్నారు. చిన్నప్పటి నుంచే క్రీడల్లో ఆసక్తి ఉండాలని, తమ పిల్లలను మంచి క్రీడాకారులుగా చేయాలనే తపన తల్లిదండ్రులలోను, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు పొందాలన్న ఆశయం పిల్లల్లోను ఉండాలని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. క్రీడలే పిల్లల భవితకు బాటలని, పిల్లల శారీరక, మానసిక వికాసానికి క్రీడలు చాలా ముఖ్య మని క్రీడల్లో భాగస్వామ్యం ద్వారా చదువుల్లోనూ బాగా రాణించవచ్చని పేర్కొ న్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను క్రీడల దిశగా ప్రోత్సహించాలని కోరారు. పిల్లలను ఆటల వైపు మళ్లించి, వారిలో క్రమశిక్షణ, మానసికోల్లాసం, దేహదారుఢ్యం పెంపొందించడంతో పాటు విద్యార్థి దశలోనే ఆటల్లో శిక్షణనిచ్చి, మెళకువలు నేర్చుకునేలా తమవంతు కృషిచేయాలని సూచించారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు, ధృవపత్రములను అందజేస్తారు. ఈ పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులను అండర్-11, 13 %డ% 15 విభాగముల నుండి 8 మంది క్రీడాకారులు చొప్పున (ప్రతి విభాగమునుండి) మొత్తం 24 మంది క్రీడాకారులను, తే.31.08.2023ది నుండి విశాఖపట్టణంలో జరిగే అండర్-15, సెప్టెంబర్ 7వ తేదీ నుండి ప్రకాశంజిల్లా ఒంగోలులో జరిగే అండర్-13, సెప్టెంబర్ 14 నుండి తూర్పుగోదావరి జిల్లా మల్కిపురంలో జరిగే అండర్-11 విభాగపు రాష్ట్రస్థాయి పోటీలకు పంపడం జరుగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సీనియర్ ఉపాధ్యక్షులు డా.వి.ఎస్.ప్రసాద్, ఉపాధ్యక్షులు నున్న సురేష్, కార్యదర్శి కుసుంబచ్చన్, కోశాధికారి అశోక్ కుమార్, మాజీ ఏ.ఎమ్.సి చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, ఎపిక్ బాడ్మింటన్ స్టేడియం యాజమాన్యం, పలువురు కోచ్ లు, జిల్లా నలుమూలలనుండి విచ్చేసిన క్రీడాకారులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యక్రమాలపై కేసులు

విశాలాంధ్ర-విజయనగరం : జిల్లా వ్యాప్తంగా పోలీసులు, ఇసుక, గంజా యి, పశువులు అక్రమ రవాణా, కోడి పందాలు, పేకాట వంటి అసాంఘిక కార్యకలా పాలపై దాడులు నిర్వహించి పలు కేసులు నమోదు చేశారు. వంగర, విజయనగరం 2వ పట్టణ పిఎస్ పరిధిలో పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు రైడ్ చేసి, 10మందిని అదుపులోకి తీసుకొని, రూ.14,725/- ల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, ప్రజాశాంతికి భంగం కలిగించిన వారిపై 45 కేసులు నమోదు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై 23 కేసులు నమోదు చేశారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు, సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టి ప్రజలు, వాహనదారులకు రహదారి భద్రత పట్ల ప్రజలకు అవగాహన కల్పించి, నిబంధనలు అతిక్రమించిన వాహనదారులకు ఈ-చలనాలుగా విధించారు. ప్రజలకు దిశా ఎస్ ఒ ఎస్ యాప్ పట్ల అవగాహన కల్పించేందుకు జిల్లాలో డ్రైవ్ చేపట్టి, దిశ యాప్ ను రిజిస్ట్రేషన్ చేయించారు. వివిధ పోలీసు స్టేషను పరిధిలో నివసిస్తున్న హిస్టరీ షీట్లు కలిగిన వారిని పిలిచి, వారి నడవడిక, చేస్తున్న వృత్తులు, నేర చరిత్ర గురించి విచారణ చేసి, సక్రమంగా జీవించాలని, నేర ప్రవృత్తి విడవకుంటే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యే శంబంగి

విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణంలో గల కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం ఉదయం 16వ జిల్లా స్థాయి తైక్వాండో పోటీలను నిర్వహించారు. బొబ్బిలి కోచ్ బంకురు ప్రసాద్ ఆహ్వానం మేరకు బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పల నాయుడు ముఖ్య అతిథిగా హాజరై ముందుగా జ్యోతి ప్రజల్వన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ క్రీడారంగానికి వైసీపీ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందన్నారు.విద్యార్థుల జీవితంలో క్రీడలు ఒక భాగంగా మారాలని ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులంతా ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరు లు శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు,వైస్ చైర్మన్ చెలికాని మురళీకృష్ణ, వార్డ్ కౌన్సిలర్లు, జేసిఎస్ కన్వీనర్ రేజేటి ఈశ్వరరావు పాల్గొన్నారు.

చదవడం మాకిష్టం

విశాలాంధ్ర-తెర్లాం: తెర్లాం శాఖా గ్రంధాలయం లో ఆదివారం చదవడం మాకిష్టం అనే కార్యక్ర కమం నిర్వహించడం అయింది.ఈ కార్యక్రమంలో విద్యార్థులకు గ్రామరు, పోటీలు మరియు అబ్దుల్ కలాం జీవిత చరిత్ర విద్యార్థి చదవగా విద్యార్థి,విద్యార్థులు వినియున్నారు.ఈ కార్యక్రమానికి 12 మంది విద్యార్థులు పాల్గొన్నారు

విజయవంతమైన ఉచిత వైద్యశిబిరం

విశాలాంధ్ర-జామి: మండలం లోని భీమసింగి గ్రామంలో ఉన్న శ్రీబాలాజీ కళాశాలలో ఆదివారం వాసవీక్లబ్, విశాఖ కు చెందిన ఓమ్ని ఆర్కె ఆసుపత్రి సంయుక్తంగా ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేసారు. ఈశిబిరానికి ముఖ్యఅతిధిలుగా వాసవీ క్లబ్ గవర్నర్ ఎ.సతీష్, స్థానిక సర్పంచ్ జొన్నాడ వెంకటలక్ష్మి హాజరయ్యారు. వాసవీ క్లబ్ అధ్యక్షులు కె. కృష్ణ, కార్యదర్శి సి హెచ్. రాంబాబుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈశిబిరంలో ఓమ్నీ ఆర్కె ఆసుపత్రికి చెందిన వైద్యనిపుణులు సుకుమార్ రోగులకు గుండెకు సంభదించిన వివిధ పరీక్షలను చేసారు. అలాగే ఉచితంగా ఇసీజీ, రక్త పరీక్షలను నిర్వహించి దాదాపు 10వేల విలువైన మందులను రోగులకు ఉచితంగా అందజేసారు. దాదాపు 130మంది రోగులు ఈశిబిరంను వినియోగించుకున్నారు. ఈకార్యక్రమంలో స్థానిక సచివాలయ కన్వీనర్ మజ్జి హరికృష్ణ, రెడ్‌క్రాస్ శాశ్వత సభ్యులు బాలమురళీతోపాటు వాసవీ క్లబ్‌కు చెందిన పలువురు సభ్యులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ముఖచిత్రంతో 100 రూపాయల నాణెం హర్షణీయం

మండల బీజేపీ అధ్యక్షులు గోకాడ మహేష్

విశాలాంధ్ర - వేపాడ : విశ్వ విఖ్యాత నట సార్వభౌమ పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారక రామరావు ముఖచిత్రంతో 100 రూపాయల నాణేం ఈనెల 28న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఆవిష్కరించడం హర్షణీయమని మండల బీజేపీ అధ్యక్షులు, విశాఖ జిల్లా కిసాన్ మోర్చా వైస్ ప్రెసిడెంట్ గొకాడ మహేష్ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎన్టీఆర్ ముఖచిత్రంతో ఈ నాణెం ముద్రణకు ఏపీ బీజేపీ రథసారధి దగ్గుబాటి పురందేశ్వరి చేసిన కృషి అభినంద నీయమన్నారు. తెలుగు వారి ఆరాధ్యదైవమైన ఎన్టీఆర్ గొప్ప తనాన్ని, కీర్తి ప్రతిష్టలను దేశమంతటా తెలిపే విధంగా కేంద్రపెద్దలు అందించిన సహకారం ఎన్నటికీ మరువలేమని బీజేపీ మండ లాక్షులు, విశాఖ కిసాన్ మోర్చా వైస్ ప్రెసిడెంట్ గోకాడ. మహేష్ అన్నారు.

ఉపాధ్యాయుల జీతాలు వెంటనే చెల్లించాలి : ఏపీటీఎఫ్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి బదిలీలు, పదోన్న తులు పొందిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (1938) ఆధ్వర్యంలో స్థానిక కోట జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు డి ఈశ్వరరావు మాట్లాడుతూ మూడు నెలలకు సంబంధించి బదిలీలు, పదోన్నతుల పొందిన ఉపాధ్యా యులకు జీతాలు నేటివరకు చెల్లించకపోవడం అన్యాయం అన్నారు. ప్రస్తుతం అధికారులు దీనికి సంబంధించి ఆర్థిక శాఖ అనుమతి లేదని చెబుతున్నారని ఈ ప్రక్రియ చేపట్టకు ముందే ఆర్థిక శాఖ అనుమతి తీసుకోవాలన్న విషయం తెలియదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఏ సదాశివరావు,ఎన్ వి పైడిరాజు, ఆర్ కృష్ణ, వై మధుసూదనరావు,ఎన్ శ్రీదేవి,దుర్గ గౌరీ తదితరులు పాల్గొన్నారు.

కరెంటు సర్వీస్ నెంబర్ కు ఆధార్ అనుసంధానం చేయాలి

విద్యుత్ ఎఇ షేక్ మస్తాన్ వలి

విశాలాంధ్ర-భోగాపురం: విద్యుత్ వినియోగదారులందరు కరెంటు సర్వీస్ నెంబర్ కు ఆధార్ నెంబర్ అనుసంధానం తప్పనిసరని ఎలక్ట్రికల్ ఎ.ఇ షేక్ మస్తాన్ వలి ఒక ప్రకటన ద్వారా తెలియజేసారు. ఆధార్ అనుసంధానం కోసం విద్యుత్ వినియోగదారులందరు తమ ప్రాంతపు లైన్ మెన్ ద్వారా గాని సమీపంలో విద్యుత్ కార్యాలయం వద్ద గాని ఆగస్టు 31 లోగా కరెంటు సర్వీస్ నెంబర్ కు ఆధార్ నెంబరు అనుసంధానం చేసుకోవాలన్నారు. అలాగే విద్యుత్ బిల్లులు అందిన 15 రోజులలో బిల్లులు చెల్లించాలని తెలుపుతూ గడువు దాటినా తరువాత కూడా బిల్లు చెల్లించకపోతే విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. సకాలంలో విద్యుతు బిల్లులు చెల్లించి ఆంధ్ర ప్రదేశ్ తూర్పు తీర విద్యుత్ పంపిణీ సంస్థ కు సహకరించాలని కోరారు.

జై భీమ్ సినిమాకు అవార్డు రాకపోవడం దారుణం

మండల మాల మహానాడు అధ్యక్షుడు దేభార్కి కిరణ్

విశాలాంధ్ర-వేపాడ : డైరెక్టర్ టీజే జ్ఞానవెల్ దర్శకత్వంలో హీరో సూర్య న్యాయవాది పాత్రలో నటించిన జై భీమ్ సినిమాకు నేషనల్ అవార్డు రాకపోవడం చాలా దారుణమని మండల మాల మహానాడు అధ్యక్షుడు దేబార్కి కిరణ్ అసహనం వ్యక్తం చేశారు.ప్రశ్నించడం,కాలు మీద కాలు వేసుకోవడం నేర్పి జాతిని మేల్కొల్పే సినిమాకు అవార్డులు రాకపోవడం చాలా బాధాకరంగా ఉందన్నారు. అదేవిధంగా బాబా సాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చాలనుకునేవారు జై భీమ్ సినిమాకు అవార్డులు ఇస్తారా అని ఎద్దేవ చేశారు.దళిత జాతి పైనే కాకుండా దళితుల గురించి తీసిన సినిమాల పైన కూడా వివక్ష చూపించడం సిగ్గుచేటు అన్నారు.జై భీమ్ సినిమాకు నేషనల్ అవార్డు ఇవ్వకపోవడాన్ని మాల మహానాడు, మిగతా దళిత సంఘాలన్నీ తీవ్రంగా ఖండిస్తున్నాయని కిరణ్ తెలిపారు.

కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు డిజీఎం చిప్పాడ మహేష్ కు ఘన సన్మానం

విశాలాంధ్ర-శృంగవరపుకోట: శృంగ వరపుకోట పీఆర్ షటిల్ బ్యాడ్మింటన్ కోర్టుకు చెందిన బ్యాడ్మింటన్ క్రీడాకా రుడు, విజయనగరం కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్ చిప్పాడ ఉమామహేశ్వరరావు శాఖాపరమైన ఉత్తమ సేవలు అందించినందుకు గాను ఈ ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా విజయనగరంలో జరిగిన జిల్లా అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి చేతుల మీదుగా అవార్డు అందుకున్న విషయం విదితమే. ఈ సందర్భంగా జిల్లా అవార్డు గ్రహీత మహేష్ ను పిఆర్ షటిల్ కోర్టు ఆధ్వర్యంలో అధ్యక్షులు అట్లూరి శ్రీవెంకటరావు, సభ్యులు బుగత వెంకటేశ్వరరావు, మ%శీ%థా సుబ్బారావు, విన్నకోట మురళి, ఎం.ప్రకాష్, డాక్టర్ పొట్నూరు శ్రీరాములు ఆధ్వర్యంలో షటిల్ క్రీడాకారులు, వారి స్నేహితులు, బందువులు ఆదివారం ఘనంగా సత్కరించారు. మహేష్ ప్రస్తుతం విజయనగరంలో జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజరుగా విధులు నిర్వహిస్తున్నారు. మహేష్ భవిష్యత్తులో కూడా మంచి సేవా తత్పరతతో రాష్ట్ర, జాతీయ స్థాయిలో శాఖాపరమైన అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో షటిల్ కోర్టు సభ్యులు కొమ్ముజు శ్రీను, ఐ. తిరుపతిరావు, రాజు, బి.అప్పలరాజు, వి.రమేష్, ఆర్. అప్పారావు, జి.శంకర్రావు, పి.శివ, స్నేహితులు భీమరాజు, మురళి బాబూలాల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కనకమహా లక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ బెల్లాన

విశాలాంధ్ర-చీపురుపల్లి: శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారిని విజయనగరం పార్ల మెంట్ సభ్యులు బెల్లాన చంద్రశేఖర్ (పెదబాబు) ఆదివారం దర్శించుకున్నారు. ఈయన ఇటీవల అమ్మవారి ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీ ఇటీవల ఇక్కడ ప్రారంభించిన విశ్రాంతి భవనాన్ని సందర్శించారు. ఆయన వెంట ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవిందరావు, వైస్ చైర్మన్ సురు కుమార్ చీపురుపల్లి మండల వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇప్పిలి తిరుమల,కర్ణపు ఆదినారాయణ, తాడేలా ఉమ, అప్పికొండ అధిబాబు, మరియు ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమయానికి రారు... స్థానికంగా ఉండరు...

ఇదీ సచివాలయ ఉద్యోగుల తీరు పట్టించుకోని ఉన్నతాధికారులు

విశాలాంధ్ర-మెరకముడిదాం: మండలంలో సచివా లయ వ్యవస్థ ఏర్పాటు చేసిన దగ్గర నుండి 18 సచివాలయలు సిబ్బంది ఇప్పటికీ స్థానికంగా లేకపో వడంతో విధులకు ఆలస్యంగా హాజరవుతున్నారు. దీనిపై ప్రజల నుండి తీవ్ర విమర్శలు వినిపిస్తున్నా.. ఉన్నతాధికారులు మాత్రం స్థానికంగా లేని ఉద్యోగులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటా మంటున్నారే గాని అవి పత్రికా ప్రకటనలకే తప్ప ఆచరణ సాధ్యం కావ టం లేదు. అందువల్ల మండలంలో పనిచేస్తున్న అన్ని శాఖల అధికారులు సచివాలయంలో చేస్తున్న ఉద్యో గులు చీపురుపల్లి, రాజాం, గరివిడి తదితర ప్రాంతాల నుండి విధులకు హాజరవుతున్నారు. ఉద్యోగులకు ముఖహాజరు ఉన్నప్పటికీ తమకేమీ పట్ట నట్లుగా కొంతమంది ఉద్యోగులు వ్యవహరించడం వలు విమర్శలకు తావిస్తుంది. దీంతో పాటుగా కొంతమంది ఉద్యోగస్తులకు డిప్యూటేషన్ వేయడం వల్ల పంచాయతీ కార్యదర్శులకు వీఆర్వోలకు అగ్రికల్చర్ ఉద్యోగులకు ప్రజలు అడిగితే ఇక్కడున్నామని అక్కడున్నామని ప్రజలకు సమాధానం చెబుతున్నారు. ఆ విధంగా విధులకు దుమ్మా కొట్టడం వీరికి పరిపాటిగా మారింది. వీరు విధులకు ఎప్పుడు వస్తారో? ఎప్పుడు వెళ్ళిపోతారో? తెలియని పరిస్థితి ఇలా ఒక శాఖ అనుకోవటం పొరపాటు. ఇలా జరగటానికి అధికారులు పర్యవేక్షణ లోపమే కారణమని చెప్పవచ్చు. సచివాలయాల్లో పని ఉన్న స్థానికులు వీరికోసం వేచి చూసి ఈసురోమంటూ వెళ్ళాల్సిన పరిస్థితి. ఇందులో పనిచేసే సిబ్బంది కొందరి నేతలకు దగ్గర బంధువులు అయినందున మొహమాటం ఉండటంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించటం జరుగుతుందన్న ఆరోపణలు లేకపోలేదు. కంచే చేను మేస్తే ఎవరిని అడగాలన్నది పెద్ద ప్రశ్న ఇక్కడ ఉత్పన్నమవుతుంది. అందువల్ల సంబంధిత ఉన్నత అధికారులు స్పందించి ప్రభుత్వ ఉద్యోగుల స్థానికంగా ఉంటూ విధులకు హాజరయ్యే విధంగా తగు చర్యలు తీసుకుంటారని పలువురు కోరుతున్నారు.

నేడు ఇసుక సత్యాగ్రహం నిర్వహణ

విశాలాంధ్ర-సీతానగరం: సీతానగరంలో ఈ నెల 28(సోమవారం) ఈశ్వరాలయంకు దగ్గరలో ఉన్న సువర్ణముఖినది రేవువద్ద టీడీపి ఆధ్వర్యంలో ఇసుక సత్యాగ్రహం అనే కార్యక్రమం నిర్వహించబడునని టీడీపి మండల అధ్యక్షుడు కొల్లి తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి రౌతు వేణుగోపాల నాయుడులు తెలిపారు.ఈకార్యక్రమానికి రాష్ట్ర తెలుగుదేశంపార్టీ అధికార ప్రతినిధి, మాజీ శాసనమండలి సభ్యులు ద్వారపు రెడ్డి జగదీష్ , నియోజకవర్గం ఇన్చార్జి బోనెల విజయ్ చంద్రలు హాజరుకానున్నట్లు తెలిపారు. మండ లంలోని టీడీపీ కుటుంబ సభ్యులు అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

అసైన్డ్ చట్ట సవరణను వెనక్కు తీసుకోవాలి

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం 9/77 అసైన్డ్ చట్టానికి సవరణ చేసి 20 సంవత్సరాలు దాటిన డి పట్టా భూములను అమ్ముకోవచ్చని జీవో చేసిందని ఈ జీవో వలన పార్వతీపురం మన్యం జిల్లాలో ఉన్న గిరిజనులు ,దళితులు, పేదలు వద్ద ఉన్న భూమి పెద్దల చేతుల్లోకి వెళ్లిపోతుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగునాయుడుఅన్నారు. ఇప్పటికే గత 40, 50 సంవత్సరాల క్రితం ఇతర జిల్లాల నుంచి ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన పెత్తందారులు సాలూరు, పాచిపెంట, మక్కువ ,పార్వతీపురం, కొమరాడ మండలాల్లో వేల ఎకరాల భూములు కొనుగోలు చేశారని అందులో డి పట్టాలు కూడా ఉన్నాయని కొంత భూమిని కొనుగోలు చేసి కొంత భూమిని దురాక్రమణ చేశారని అన్నారు ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి తెచ్చిన ఈ జీవోతో అక్రమంగా ఉన్న అసైన్డ్ భూములన్ని మన్యం ప్రాంతంలో సక్రమంగా మారిపోతున్నాయని దీనివలన గిరిజనులు పెద్ద ఎత్తున నష్టపోతున్నారని కాబట్టి వెంటనే 9/77 అసైన్డ్ చట్ట సవరణను వెనక్కి తీసుకోవాలని కోరారు అలాగే ఆగస్టు 31వ తేదీ లోపు సచివాలయాల్లో డీ పట్టా సాగుదారులు, హక్కుదారులు పేర్లు నమోదు చేసి బహిరంగంగా లిస్టులు పెట్టాలని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ జిల్లాలో ఎక్కడ వీఆర్వోలు విచారణ చేయలేదని లిస్టులు తయారు చేయలేదని. ఏ సచివాలయంలో కూడా డి పట్టాలిస్టులు పెట్టలేదని ,వెంటనే కలెక్టర్ తహసిల్దార్ లు జోక్యం చేసుకొని వాస్తవ డిపట్టాదారులు, సాగుదారులని సచివాలయాల్లో లిస్టులు పెట్టాలని అన్యాక్రాంతమైన డి పట్టా భూములన్ని తిరిగి పట్టాదారులకు అప్పజెప్పాలని డిమాండ్ చేశారు లేకపోతే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున గిరిజనులని, దళితులని, పేదలను కదిలించి భూ పోరాటాలు చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు జిల్లా కమిటీ సభ్యులు పాలమెట్ట రాము, భూతాల మోహన్ రావు, గరుగుబిల్లి శ్రీనివాసరావు ,దుర్గారావు సివున్నాయుడు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలకే పరిమితమౌతున్న పూర్ణపాడు లాభేసు వంతెన

డోలీల మోతతో మృత్యువాత పడుతున్న గిరిజనులు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: ఎన్నికల హామీలకే పూర్ణపాడు లాబేసు వంతెన నిర్మాణం పరిమిత మౌతుందనీ,రాజుల పాలనలో సమస్యలు రాజ్యమేలుతున్నాయని జనసేన పార్టీ నాయకులు వంగల దాలి నాయుడు అన్నారు. ఆదివారం పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలంలో జరుగుతున్న పూర్ణపాడు వంతెన సాధన కమిటీ రిలే నిరాహార దీక్షల్లో ఆయన పాల్గొని మద్దతు తెలిపారు. పూర్ణపాడు - లాభేసు వంతెన నిర్మాణం అనేదాన్ని దశాబ్దాలుగా ఎన్నికల హామీలకే వాడుకున్నారన్నారు. లేదంటే వారు తలుచుకుంటే పూర్ణపాడు లాబేసు వంతెన నిర్మాణం ఏ పాటిదన్నారు. గిరిజన సమస్యలు పరిష్కారంలో తగు చొరవ చూపకపోవడం వల్ల ఇప్పటికి గిరిజనులు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికీ గిరిజనులు మౌలిక సదుపాయాలకు నోచుకోక సమస్యలతో సతమతమవు తున్నారన్నారు. ఈ రోజుకి గిరిజన ప్రాంతాలకు రహదారి సదుపాయము లేక అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ లు కూడా వెళ్ళని పరిస్థితుల్లో డోలీల మోతలు తప్పడం లేదన్నారు. శాస్త్ర సాంకేతిక విజ్ఞానం నింగిని చేరి చంద్రమండలాన్ని తాకిన ఈ రోజుల్లో కూడా గిరిజనులు, గిరిజన విద్యార్థులు దోమకాటుకు, పాముకాటుకు బలవుతూ మృత్యువాత పడటం బాధాకరం అన్నారు. కొమరాడ మండలంలోని తొమ్మిది పంచాయతీలు, సుమారు 60 గ్రామాల గిరిజనులకు అత్యవసరమైన పూర్ణపాడు లాభేసు వంతెన నిర్మాణం పూర్తి చేసుకోకపోవడం పూర్తిగా పాలకులు, అధికారుల అలసత్వమే అన్నారు. ఇటీవల కురుపాముకు వచ్చిన ముఖ్యమంత్రి దృష్టికి సైతం పూర్ణపాడు లాభేసు వంతెన సమస్య వెళ్లకపోవడం బాధాకరమన్నారు.గిరిజన పాలకులుగా ఉంటూ గిరిజనుల సమస్యలు పరిష్కరించకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి వంతెన నిర్మాణం పూర్తికి చర్యలు చేపట్టాలన్నారు.

సీతానగరం రైల్వేస్టేషన్ రోడ్డును బాగు చేయండి

రోడ్డు సమస్యపై ఎంపి మాధవికి, రైల్వే అధికారులకు స్థానికుల విజ్ఞప్తి

విశాలాంధ్ర-సీతానగరం: మండల కేంద్రంలోని సీతానగరం రైల్వే స్టేషన్ నుండి ప్రధానరోడ్డుకుగల రహదారి పూర్తిగా గుమ్ములు, గోతులతో కూడిఉన్నందున రాత్రిపూట ట్రైన్ దిగేప్రయాణికులు వెళ్తున్న సమయంలో గోతులవల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నడిచే వెళ్ళేవారు, ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారంతా కేవలం 500మీటర్ల దూరంను వెళ్ళడానికి నరకం చూస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు పెద్ద ఎత్తున చేరిఉండటంతో గత మూడు రోజులుగా చాలామంది ద్విచక్ర వాహనాల నుండి జారిపడినట్లు తెలిపారు. మూడవ రైల్వే లైన్ పనులవల్ల స్టేషన్ కు ఉండే బిటి రోడ్డును కప్పివేయడం, గుమ్ములు, గోతులతో రోడ్లు ఉండటంతో ఎలా వెళ్లాలని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.అత్యంత ఆదాయాన్ని కలిగే రైల్వేలో రోడ్లుఇలా ఉండటంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడే మెటీరియల్, పనిచేసే మనుషులు పెద్దఎత్తునఉన్నా రోడ్డుని ఎందుకు మరమ్మత్తులు చేయడం లేదని సీతానగరం మండలంలోని పలువురు ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఆదివారం స్థానిక విలేకరులు పరిశీలించి సమస్య తీవ్రతను రాయగడలో ఉన్న ఏఈఈ, బొబ్బిలిలో ఉన్న ఐఓడబ్ల్యు అధికారి,స్టేషన్ మాస్టారుల దృష్టికి తీసుకొని వెళ్లగా వారు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్తామని తెలియజేశారు. ఇప్పటికే పలుసార్లు నివేదించిన సమస్య పరిష్కారం జరగలేదని తెలిపారు. దీంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులను అరకు పార్లమెంటు సభ్యురాలు గొడ్డేటి మాధవి దృష్టికి సంతకాలు చేసిన ఒక వినతి పత్రాన్ని పంపించినట్లు తెలిపారు.దీనిపై ఎంపీ స్పందిస్తూ రైల్వే స్టేషన్ వద్ద రోడ్డు దుస్థితిని విశాఖపట్టణం డివిజనల్ రైల్వేమేనేజర్ దృష్టికి తీసుకొని వెళ్లడం జరిగిందని ఎంపి మాధవి తెలిపారు. ప్రయాణికులు రోడ్డువల్ల రాత్రిపూట ఎదుర్కొంటున్న ఇబ్బందుల్ని తక్షణమే పరిష్కారం చేసేందుకు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుంది ఆమె అన్నారు.

టిడిపిలో వైసిపి కోవర్టు : ద్వారపురెడ్డి ఆరోపణ

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: నియోజక వర్గ తెలుగుదేశం పార్టీలో కొంతమంది నాయకులు వైసిపి కోవర్ట్ లుగా వ్యవహరిస్తున్నారని జిల్లా బిజెపి అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు ఆరోపించారు. ఆదివారం భారత జనతా పార్టీ కార్యాలయంలో ద్వారపు రెడ్డి శ్రీనివాస్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం నియోజకవర్గంలో వైఎస్ఆర్సిపి పార్టీని ఎదుర్కొనే సత్తా బిజెపి, జనసేన ఉమ్మడి అభ్యర్థికి మాత్రమే సాధ్యమని,టిడిపికి అది సాధ్యం కాదని అన్నారు. టిడిపి పార్టీలో వైఎస్ఆర్సిపి పార్టీ కోవర్టు చాలామంది ఉన్నారనిదానివల్ల టిడిపికి పెద్ద ఎదురు దెబ్బ తగులుతుందని హెచ్చరించారు.

పార్టీకి నిబద్ధతతో పనిచేస్తే గుర్తింపు తప్పనిసరి

ఎమ్మెల్యే జోగారావు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: పార్టీని నమ్ముకున్న వారికి సమయం వచ్చినప్పుడు తప్పక పార్టీలో సముచిత స్థానం లభిస్తుందనీ ఎమ్మెల్యే అలజంగి. జోగారావు అన్నారు. ఇటీవల జిల్లా కార్యవర్గ సభ్యులు నియమించబడిన సభ్యులు ఆదివారం ఎమ్మెల్యేలు మర్యాద పూర్వకంగా కలుసుకొని అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా పార్టీ ఉపాధ్య క్షులుగా పార్వతీపురం మండలం వైసీపీ సీనియర్ నాయకులు భీమవరపు కృష్ణమూర్తి, జిల్లా పార్టీ జనరల్ సెక్రెటరీగా వెంపలి గురురాజు, జిల్లా పార్టీ సెక్రటరీలుగా సీతానగరం మండలం నుంచి సీనియర్ నాయకులు పోల ఈశ్వరణారయన, బలిజిపేట మండలం నుంచి రంగుముద్రి గణపతి రావు, మూడు మండలాలు మరియు పురపాలక సంఘం నుంచి ఎక్జిక్యూటివ్ మెంబర్లుగా సామంతులు మాధవనాయుడు, గులిపల్లి కృష్ణమోహన్, వేమల దానబాబు, రెడ్డి అప్పలనాయుడు, ఎండరాడ శ్రీరాములు నాయుడు, కోట సంజీవి, బత్తుల శ్రీదేవి, నడిమింటి రవీంద్ర లను పార్టీ నియమించిందని తెలిపారు. ఈ సందర్భంగావారికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేస్తూ పార్టీ అభివృద్ధికి మీరు మరింత కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు వెంట పాల్గొన్నారు.

పార్వతీపురం మన్యం జిల్లా వైసీపి ప్రధాన కార్యదర్శిగా 'జరజాపు సూర్యనారాయణ'

పలువురు రాజకీయ నాయకులు కార్యకర్తలు, అభినందనలు

విశాలాంధ్ర-సాలూరు టౌన్: నిండు మనసుతో అందరినీ ఆప్యాయంగా పలకరించే మంచి మనసున్న మనిషి జరజాపు సూర్యనారాయణ అని పలువురు రాజకీయ నాయకులు, విశ్లేషకులు తెలిపారు..ఈ సందర్భంగా మొన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు, కార్యదర్శులు, జాబితాలను విడుదల చేశారు. ఇందులో భాగంగా సాలూరు పట్టణానికి చెందిన వైఎస్ఆర్సిపి నాయకులు మంత్రి రాజన్న దొరకు మంచి సన్నిహితుడు అయిన జరజాపు సూర్యనారాయణ (సూరిబాబు) ని మన్యం జిల్లాకు వైఎస్ఆర్సిపి ప్రధాన కార్యదర్శిగా నియమించారు.అయితే వారికి అలాంటి పదవి ఇచ్చినందుకు సాలూరు పట్టణ ప్రజలకు రాజకీయ నాయకులకు వారి అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ నాకు ఈ పదవి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి అలాగే మా నాయకులు మంత్రి రాజన్న దొరకు ప్రత్యేకగా నేను రుణపడి ఉంటాను.ఇలాంటి పదవులు ఉన్నా లేకపోయినా నేనెప్పుడూ వైఎస్ఆర్సిపి పార్టీకి నా వంతు కృషి చేస్తానని తెలియజేశారు.అందరు నన్ను ఆదరిస్తూ అభిమానిస్తున్నందుకు నేనెప్పుడూ సాలూరు పట్టణ ప్రజలకు కృతజ్ఞులై ఉంటానని అన్నారు. ఇలాంటి పదవులు మీరు ఎన్నో చేపట్టాలని కోరుతూ పలువురు రాజకీయ నాయకులు, కార్యకర్తలు అభిమానులు, పూలదండ వేసి బొకేలు ఇస్తూ అభినందనలు తెలియజేశారు.

కేంద్ర రాష్ట్రాల ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా 30 నుండి ధర్నా

విజయవంతానికి సీపీఎం పిలుపు

విశాలాంధ్ర-బెలగాం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై అధిక ధరలు, విద్యుత్ చార్జీలు తగ్గించాలని, నిరుద్యోగ సమస్య పరిష్కారించాలని ఆగస్టు 30 నుండి సెప్టెంబర్ 4 వరకు సచివాలయాలు, మండల ఆఫీసుల వద్ద నిరసన ధర్నాలలో ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు కార్యదర్శి వర్గ సభ్యులు కొల్లి గంగు నాయుడు, జిల్లా కమిటీ సభ్యులు గొర్లి వెంకటరమణ బంటు దాసు గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలుకి నిరసనగా ఆగస్టు 30, 31 తేదీలలో ప్రజల వద్దకు వెళ్లి కరపత్రాలు పంపిణీ, సభలు, సమావేశాలు జరిపి సంతకాల సేకరణ చేపట్టాలని, సెప్టెంబర్ 1న సచివాలయాల వద్ద నిరసన, వినతిపత్రాలు అందజేయాలని, సెప్టెంబర్ 3వ తేదీన నిరుద్యోగ వ్యతిరేక దినం పాటించాలని రౌండ్ టేబుల్ సమావేశాలు, సభలు జరపాలని, సెప్టెంబర్ 4వ తేదీన జిల్లా వ్యాప్తంగా అన్ని మండల తహశీల్దార్ కార్యా లయాల వద్ద నిరసన ధర్నాలు చేపట్టాలని ఈ కార్యక్రమాల్లో జిల్లా ప్రజలందరూ పాల్గొనాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటీగా కోరుతున్నామన్నారు.

29న పాలకవర్గ సమావేశం

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: ఈ నెల 29వ తేదీన పురపాలక సంఘం పాలకవర్గ సమావేశం నిర్వహించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు తెలిపారు. ఈ సమావేశానికి శాసన సభ్యులు అలజంగి.జోగారావు, మున్సిపల్ ఛైర్పర్సన్ బోను. గౌరిశ్వరి హాజరవుతారు కావున ఈ సమావేశానికి పురపాలక సంఘం అధికారులు,సిబ్బంది పాలక వర్గ సభ్యులు తప్పక హాజరుకావాలని కోరారు.

బుడ్డిపేటలో మదర్ థెరిస్సా సేవా సంఘం ఆధ్వర్యంలో 113వ జయంతి

విశాలాంధ్ర -సీతానగరం: మండలంలోని బుడ్డిపేట గ్రామంలో ఆదివారం నాడు మదర్ థెరిస్సా 113వ జయంతి కార్యక్రమాన్ని మదర్ థెరిస్సా సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పంచాయతీ ఉప సర్పంచ్ అరవింద్ కుమార్, వైఎస్సార్సీపీ సీనియర్ నేత ఆర్వీ పార్థసారథి హాజరై నివాళులర్పించారు. మదర్ థెరిస్సా సేవలను కొనియాడారు.ఈసందర్భంగా విద్యార్థులకు నోట్ పుస్తకంలను ,పెన్నులను పంపిణీ చేశారు ఈకార్యక్రమంలో సభ్యులు వెంకటరమణ, రామకృష్ణ, ప్రసాద్ ,సాయి, లక్ష్మణరావు, గణేష్ ,శివ తదితరులు పాల్గొన్నారు.

క్షత్రియ మహిళా పరిషత్ ఆద్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం

విశాలాంధ్ర -విజయనగరం టౌన్ : క్షత్రియ మహిళా పరిషత్ ఆద్వర్యం లో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని క్షత్రియ పరిషత్ అధ్యక్షులు ఎన్ ఎస్ ఎన్ రాజు ప్రారంభించారు. ఈ ఆరోగ్య శిబిరం లో. 30 నుండి 65 సంవత్సారాల వయస్సు గల మహిళల అన్ని రకాల ఆరోగ్య సమస్యల కి మరియు కేన్సర్ పరీక్షలు చేసి ప్రముఖ మహిళా వైద్య నిపుణులు, అంకాలజిస్ట్ డాక్టర్ లీల చే తనికీలు చేసి మందులు ఉచితం గా అందజేశారు. మహిళా పరిషత్ అధ్యక్ష కార్యదర్శులు లలిత రాజు, సుధా రాజు లు మాట్లాడుతూ వికాస తరంగిణి మహిళా ఆరోగ్య వికాస్ వారి సహకారం తో ఈ వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందన్నారు. అందరికి ఆరోగ్యం అందుబాటు లోకి తేవాలి అన్న ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా పరిషత్ సభ్యుల తో పాటు యూత్ పరిషత్ మరియు క్షత్రియ పరిషత్ సభ్యులు సీతా రామ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామీ దయానంద సరస్వతి జయంతి వేడుకలు

విశాలాంధ్ర-సీతానగరం: పరమపూజ్య స్వామి దయానంద సరస్వతి ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ఏర్పాటు చేసిన క్షేత్రాలయాల్లో వేలాదిమందికి నేడు విద్యను అందించడమే గాక ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు గుడివాడ శ్రీవిద్యాపీఠం పీఠాధిపతి స్వామి స్థైర్యానంద సరస్వతి తెలిపారు. ఆదివారం మండలంలోని లచ్చయ్యపేట ఎయిమ్ ఫర్ సేవా క్షేత్రాలయంలో జరిగిన గురువుకు వందనం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని సందేశాన్ని అందించారు. ముందుగా స్వామి దయానంద సరస్వతి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళు లర్పించారు. ఆయన స్థాపించిన సేవాలయాల్లో చేస్తున్న కార్య క్రమాలు గూర్చి, ఆధ్యాత్మికత గూర్చి వివరించారు. ప్రత్యేక అతిథులుగా ఎన్ జి ఓ నేత రౌతు రామమూర్తి, కొత్త అప్పారావు, అభ్యుదయ విద్యా సంస్థల అధినేత చింత శారద, జనసేన రాష్ట్రనేత బాబు పాలూరులతోపాటు సేవాసంస్థ కమిటీ సభ్యులైన కొత్తా రవికుమార్, పుల్లెల శ్రీనివా సరావు, సాల అశోక్, గోన ప్రసాద్, తంగుడు గురు నాథరావు, మగ్రాపు లీలా మోహన్, పి .నాగమణి, జామి రమాదేవి, హాస్టల్ మేనేజరు నల్లాసురేష్ కుమారులు మాట్లాడారు. సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవలు గూర్చి, విద్యా విధానం గూర్చి వివరించారు. క్షేత్రాలయ పూర్వ విద్యార్థి మత్సశివకు సాఫ్ట్ వేర్ ఉద్యోగం రావడంతో గురువుకు వందనం కార్యక్రమ నిర్వహణకు 20వేల నగదును స్వామీజీ చేతికి అందజేసారు. హైదరాబాద్ కు చెందిన సాఫ్టవేర్ ఉద్యోగి బెవర రాంబాబు క్షేత్రాలయానికి లాప్ టాప్, ప్రొజెక్టర్ ను అందజేసారు. క్షేత్రాలయ విద్యార్థుల ప్రతిభను గుర్తించి ముగ్గురు విద్యార్థులకు కమిటీ సభ్యులైన తంగుడు గురునాథరావు నగదు బహుమతులు అందజేశారు. సంస్థకు సేవలు అందిస్తున్న డిసిటిఓ దేవులపల్లి సన్యాసిరావు దంపతులను సన్మానించారు. గురువుకు వందనం కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన పలు కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

వాకర్స్ క్లబ్బులు సమాజానికి పట్టుకొమ్మలు

డాక్టర్ డివిజి.శంకరరావురాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం అయ్యన్నపేట జంక్షన్ వద్దనున్న నడక మైదానంలో నెలవారీ సమావేశాన్ని క్లబ్ అధ్యక్షుడు చెల్లూరి శ్రీనివాసరావు(సి.హెచ్. రమణ) అధ్యక్షతన నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ సాహితీవేత్త రాష్ట్ర ఎస్టీ కమీషన్ చైర్మన్ డాక్టర్ డి.వి.జి.శంకరరావు, డిస్ట్రిక్ట్ -102 గవర్నర్ కర్రోతు సత్యం,క్లబ్ పెద్దలు,42వ డివిజన్ కార్పొరేటర్,గోల్డ్ డోనర్ పిన్నింటి కళావతి హాజరయ్యారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఎస్టీ కమీషన్ చైర్మన్ డాక్టర్ డి.వి.జి. శంకరరావు మాట్లాడుతూ వాకర్స్ క్లబ్బులు సమాజానికి పట్టుకొమ్మలని, సమాజానికి ఎంతో ఆదర్శమని, ఆరోగ్యమే మహాభాగ్యంగా తమ ఆరోగ్యం కాపాడుకుంటూ, సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ,యావత్ ప్రజానీకానికి ఆరోగ్యంపై అవగాహన కల్పించడంలో ప్రముఖ పాత్రను వాకర్స్ క్లబ్బులు ప్రముఖ పాత్రను పోషిస్తున్నాయని వాకర్స్ క్లబ్బులు చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం మరో అతిథులుగా విచ్చేసిన క్లబ్ పెద్దలు పిన్నింటి కళావతి,డిస్ట్రిక్ట్ 102 గవర్నర్ కర్రోతు సత్యం మాట్లాడుతూ ప్రార్థించే పెదవులు కన్నా సహాయం చేసే చేటు మిన్న అన్నచందంగా నడక క్లబ్బులు పనిచేస్తున్నాయని, డిస్ట్రిక్ట్ 102 పరిధిలో మరెన్ని క్లబ్బులు పెరగాల్సిన అవ సరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం క్లబ్ ప్రధాన కార్య దర్శి కోట్ల సత్యనారాయణ నెలవారీ నివేదికను సమర్పించి, అతిథులకు, సభ్యులందరికీ తెలిపారు. చివరిగా క్లబ్ పెద్దలంతా ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ డి.వి.జి. శంకరరావు కు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ గాయత్రి, ఎలక్ట్ గవర్నర్ డి.శ్రీరామ్మూర్తి,డిస్ట్రిక్ట్ 102 ఏరియా కో ఆర్డినేటర్ జి.కృష్ణంరాజు,రీజనల్ కౌన్సిలర్ కె. ఏర్నాయుడు, వాకర్స్ ఉద్యమ కారులు, ప్రముఖ న్యాయవాది ఎస్. ఎస్.ఎస్.ఎన్.రాజు, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ కార్యదర్శి త్యాడ చిరంజీవి రావు,ఫ్రెండ్స్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు, వాకర్స్ ఉద్యమనాయకులు పప్పు విశ్వనాథం,బాలాజీ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు రామరాజు, రామసాయి వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కొల్లు సత్యం మాస్టారు,శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ పెద్దలు పిన్నింటి సూర్యనారాయణ, గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఎ.ఎస్. ప్రకాశరావు మాష్టారు,గౌరవ సలహాదారు ఎ.తిరుపతిరావు, కోశాధికారి జి. గోవిందరావు, తదితరులు భారీగా సభ్యులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమరవాణాపై నేడు సత్యాగ్రహ దీక్ష

ఇంచార్జి విజయ్‌చంద్ర

విశాలాంధ్ర-పార్వతీపురం: రాష్ట్రంలో ఇసుకఅక్రమ మైనింగ్ పై సత్యగ్రహ నిరసన కార్యక్రమంలు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు పార్వతీపురం నియోజక వర్గ టీడీపీ ఇంచార్జి బోనెల విజయ్ చంద్ర తెలిపారు. సోమవారం సీతానగరం మండలంలోని సువర్ణముఖి నదివద్ద ఇసుకఅక్రమ మైనింగ్ నిరసిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. టెండర్లు పిలవకుండా అక్రమ ఇసుక రవాణా జరుగుతున్న తీరును నిరసిస్తూ కార్యక్రమం చేస్తామన్నారు. ఇసుక ర్యాంపుల వద్ద సెల్ఫీఛాలెంజ్ ఫోటోలు తీస్తామని తెలిపారు. రెండో రోజు మంగళవారం నియోజకవర్గంలో అన్ని మండలాల్లో మండలపార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో తహశీల్దార్, ఎస్ ఐ లకు అక్రమ ఇసుక మైనింగ్‌పై వినతిపత్రాలు అందజేస్తామని చెప్పారు. మూడో రోజున ఇబ్రహీంపట్టణంలోగల డిజిఎం ప్రధాన కార్యాలయం వద్ద అన్ని నియోజక వర్గాల నేతలతో నిరసన కార్యక్రమం చేస్తామని చెప్పారు. ఈసత్యాగ్రహ దీక్ష కార్యక్రమాలలో టీడీపి కుటుంబ సభ్యులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తాటిపూడి ఆయకట్టు రైతు సంఘం ఆధ్వర్యంలో జీవీఎంసీ వద్ద నేడు ధర్నా

విజయవంతం చేయాలని సిటూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ పిలుపు

విశాలాంధ్ర, శృంగవరపుకోట : మండలంలోని కృష్ణాపురం గ్రామం వద్ద గల విశాఖపట్నం నగరానికి మంచి నీటిని సరఫరా చేసే తాటిపూడి జలాశయం నీటి శుద్ధి కేంద్రం వద్ద తాటిపూడి ఆయకట్టు రైతు సంఘం మరియు గిరిజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక ప్రజల సమస్యలు పరిష్కరించాలని, జలాశయం రోడ్డును నిర్మించాలని కోరుతూ సోమవారం ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు హాజరవుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తాటిపూడి జలాశయం నుంచి (జీవీఎంసీవాళ్లు) విశాఖ ప్రజానీకానికి త్రాగునీరు అవసరమనే పేరుతో మన ప్రాంతం నుంచి త్రాగునీరు తరలించకుపోయి పరిశ్రమలకు వందల కోట్ల రూపాయలకు అమ్ముకుంటున్నారని స్పష్టం చేశారు. మన ప్రాంతాల్లో ఉన్న రైతుల నుంచి భూములు తీసుకుని తాటిపూడి నుంచి మొదలుకొని మండలంలోని కొత్తూరు వరకు సుమారు పది కిలోమీటర్ల రోడ్డు వేయడం జరిగిందని తెలిపారు. ఈ రోడ్డు గత 20 ఏళ్లుగా పాడై ఈ రోడ్డున ప్రయాణించాలంటే ఎన్నో ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని, రోడ్డు పాడవటం వలన ఈ రోడ్డుకు ఆనుకొని ఉన్న గ్రామాలైన కృష్ణాపురం, భీమవరం, మధుపాడ, విశ్వనాధపురం, ముసిడిపల్లి, తాటిపూడి కాలనీ వాసులు, వాహనదారులు, స్టూడెంట్స్, పాదచారులు ఇలా చాలామంది ఇబ్బందులకు గురవుతున్నా జీవీఎంసీ పట్టించుకోకుండా వదిలేయడం తగదన్నారు. తాటిపూడి నీటితో వ్యాపారం చేస్తున్న జీవీఎంసీ రోడ్డును బాగు చేయించాలని కోరుతూ ధర్నా నిర్వహిస్తున్నామని, ఈ ధర్నాలో పై గ్రామాల ప్రజలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ కోరారు.

మధురమైనది మాతృభాష

నారం శెట్టి ఉమామహేశ్వరరావు

విశాలాంధ్ర -విజయనగరం టౌన్: మన మాతృభాష మధురమైనదని, అమ్మభాష అమృతతుల్యమని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు అన్నారు. తెలుగు భాషా పరిరక్షణసమితి అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్ అధ్యక్షతన జరిగిన తెలుగుభాషా దినోత్సవ వేడుకల్లో పాల్గొని మాట్లాడుతూ మాతృభాషను పరిరక్షించు కోవాలని అన్నారు. గురుప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాష వైభవాన్ని, చారిత్రక వారసత్వాన్ని, కావ్య గౌరవాన్ని కాపాడినప్పుడే భాష అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉత్తరాంధ్ర స్థాయి కవిసమ్మేళనంలో సుమారు 50 మంది కవులు తమ కవితలను వినిపించారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పద్యపఠనం పోటీలలో విజేతలకు బహుమతులు అందచేసారు. మానాప్రగడ శేషశాయి పేరిట పురస్కారాన్ని ప్రముఖ సాహితీవేత్త కొట్టుబాబూరావుకు ప్రదానం చేసారు. నడక పోటీలలో జిల్లా స్థాయి విజేతలకు పతకాలను బహూకరించారు. ఈ నేపథ్యంలో నారంశెట్టి ఉమామహేశ్వ రరావు దంపతులకు కుసుమంచి సుబ్బారావు, గురుప్రసాద్ దంపతులు ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జక్కు రామకృష్ణ, భ్మైరవభట్ల ఆదిత్య, శుభకర సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకులు పులిపాటి రామారావు, గిరిజా ప్రసన్న, మానాప్రగడ సాహితి, గురజాడ ఇందిర, చివుకుల శ్రీలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి ప్రేమికులు జగ్గయ్యపేట యువకులు

రోడ్డు ఇరువైపులా 100 మొక్కలునాటిన యువకులు

హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

విశాలాంధ్ర -వేపాడ: మండలంలోని జగ్గయ్యపేట గ్రామ యువకులు ప్రకృతి ప్రేమికులనడంలో ఎటువంటి సందేహం లేదు. నేటి యువత దారితప్పి చెడు మార్గంలో పయనిస్తున్న తరుణంలో జగ్గయ్యపేట గ్రామ యువకులు గ్రామ అభివృద్ధి కోసం పాటుపడుతూ గ్రామాన్ని పచ్చదనంతో నింపాలనే సదుద్దేశంతో నడుంబించారు. మండలంలోని జగ్గయ్యపేట గ్రామంలో గల కొంతమంది యువకులు తమ సొంత ఖర్చులతో పలు రకాల 100 మొక్కలను కొని తెచ్చి, గ్రామంలోని రోడ్డుకు ఇరువైపులా నాటారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి యువకుడు ఒక మొక్కను పెంచి పర్యావరణాన్ని పరిరక్షించడంలో తమవంతుగా బాధ్యత పడాలన్నారు. అలాగే మొక్కలను పెంచడం వలన సకాలంలో వర్షాలు పడి పంటలు కూడా బాగా పండుతాయన్నారు.ఈ మొక్కల నాటిన కార్యక్రమంలో గ్రామంలోని యువకులు తదితరులు పాల్గొన్నారు.

నాటు సారా రవాణాపై దాడులు

ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం, ఒకరు అరెస్ట్, మరో వ్యక్తిపై కేసు నమోదు



విశాలాంధ్ర- పార్వతీపురం టౌన్: జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ విక్రాంత్ పాటిల్, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీ దిలీప్ కిరణ్ ఆదేశాల మేరకు ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్ యల్. ఉపేంద్ర ఆధ్వర్యంలో ఒడిషా రాష్ట్రం నుండి ఆంధ్రా ప్రాంతానికి నాటు సారా రవాణా జరుగుతుందన్న సమాచారంతో పార్వతీపురం మండలం పెదమరికి గ్రామ సమీపంలో దారి కాపలా కాసి 160 లీటర్ల నాటుసారాతో పాటు ఒక ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి పార్వతీపురం మున్సిపాలిటీ రెల్లివీదికి చెందిన వినోద్ అను వ్యక్తిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేయడం జరిగిందనీ ఇనస్పెక్టర్ ఎల్.ఉపేంద్ర తెలిపారు.ఈ కేసుకు సంబంధించిన ఒడిషా రాష్ట్రానికి చెందిన నాటు సారా సరఫరాదారుడు చంద్రయ్య అను వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలపడమైనది. ఈ దాడుల్లో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఇన్స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర, యస్ఐ వి వి రమణ, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫుడ్ ఇన్స్పెక్టర్ రాక.. దుఖాణాల మూత

ఇదంతా మామ్మూళ్లే అంటున్న స్థానికులు

విశాలాంధ్ర-జామి: ప్రజా జీవితంలో నిత్యవసర వస్తువులు ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నాయి. బ్రాండెడ్ కంపెనీలను తలదన్నేలా నకిలీ కంపెనీలు పుట్టుకొస్తున్నాయి. ఇదంతా మనకు తెలిసిన వాస్తవాలే. అయితే ఇటువంటి నకిలీల ఆటకట్టించేందుకు ఫుడ్ ఇన్స్పెక్టర్‌లను ప్రభుత్వం నియమించి కీలక బాధ్యతలను అప్పగించింది. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే బాధ్యత వీరిపై పెట్టింది. కానీ ఫుడ్ ఇన్స్పెక్టర్ల తనిఖీలపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఆకస్మిక తనిఖీలు చేయాల్సిన అధికారులు తాము వస్తున్నట్లుగా ముందుగా వ్యాపారులకు సమాచారమందిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో అధికారులు వచ్చిన రోజున దుఖాణాలు మూసివేస్తున్నారు. దీంతో ఏదో ఒక దుఖాణాన్ని తనిఖీ చేసి కంపెనీల వస్తువులను తనిఖీ చేసి కేసులు రాసుకుని అధికారులు వెళ్ళిపోతున్నారు. ఇది జామి మండలానికి సంభందించి ఏళ్ళ తరబడి జరుగుతున్న వ్యవహారం. అధికారులు సమాచారం ఇవ్వకుండా తనిఖీలకు వస్తే బాగుంటుందని, ఇలా మామ్ములుగా రావడం ఏంటని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. శనివారం ఫుడ్ఇన్స్పెక్టర్ నాగుల్‌మీరా తనిఖీలు చేయగా, జామిలోని దుఖాణాలు దాదాపు అన్నీ మూతపడ్డాయి.

యోగా పీజీ, డిప్లమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఎయిమ్ రామయోగ ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ ఆరిశెట్టి ఇందమణి

విశాలాంధ్ర-సాలూరు టౌన్ : యోగ చేయడం వలన మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తుందని ఎన్నో రకాల వ్యాధుల నుంచి బయటపడవచ్చు అని ఎయిమ్ రామయోగ ట్రస్ట్ ప్రముఖులు అధ్యక్షులు డాక్టర్ ఆరిశెట్టి ఇందుమణి పేర్కొన్నారు. ఆదివారం సాలూరు పట్టణం రామయోగ ట్రస్ట్ కార్యాలయంలో పత్రిక సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షులు ఇందుమణి మాట్లాడుతూ విజయనగరం,పార్వతిపురం మన్యం జిల్లాలో ఆంధ్ర యూనివర్సిటీ ఆధ్వర్యంలో కొత్తగా కొన్ని రకాల యోగా కోర్సులను ప్రవేశ పెడుతున్నామని అన్నారు.పీజీ,డిప్లమా యోగ కోర్స్ కోసం ఈ నెల 23న ఆంధ్ర యూనివర్సిటీ ఎయిమ్ రామ యోగ ట్రస్టులకు మధ్య ఏంఓయూ ఒప్పందం జరిగింది. అయితే ఈ కోర్స్ కు అర్హత కలిగి చదువు ఏ డిగ్రీ చదివిన విద్యార్థులైన ఈ పీజీ యోగా కోరుచుకు అర్హులు అని అన్నారు. ఇంటర్ చదివిన విద్యార్థులు డిప్లమా యోగ కోర్సుకులకు వారు కూడా అర్హులని అన్నారు. పీజీ కోర్సు కు సంవత్సరం కాలం పరిమితి ఉంది. డిప్లమా కు ఆరు నెలల వ్యవధి ఉంటుంది అన్నారు. ప్రతిరోజు రెండు గంటల పాటు సాలూరు లో రామయోగ ట్రస్టు యోగ క్లాస్లు నిర్వహిస్తుంది. యోగ కోర్స్ చేయడం వలన యువత ప్రపంచంలో ఎక్కడైనా ఆంధ్ర యూనివర్సిటీ ఇచ్చిన సర్టిఫికెట్ తో పాఠాలను బోధించవచ్చనని తెలిపారు. స్వయం ఉపాధి పొందడానికి యోగ కోర్స్ ఎంతగానో దోహదపడుతుందని తెలియజేశారు.అలాగే మానవుల్లో అనారోగ్యం లేకపోవడమే ఆరోగ్యం కాదని మానవులు శారీరకంగా,మానసికంగా, భౌతికంగా, ఆర్థికంగా, సామాజికంగా, అన్ని విధాల దృఢంగా ఉన్నప్పుడు సంపూర్ణ ఆరోగ్యం అవుతారని వీటి అన్నిటిని అందించేది ఏకైక శిక్షణ యోగ అనే కొనియాడారు. మనిషిలోని అన్ని వ్యవస్థలను ఆరోగ్యంగా ఉండడమే కాకుండా సమస్వయం సహకారంతో దృఢత్వం కల్పించడానికి సహాయపడుతుంది అని ఆమె అన్నారు. వ్యాధి నిరోధిక శక్తి పెంచడమే కాకుండా కొత్త రోగాలు రాకుండా నివారిస్తుంది అని అన్నారు.మనసు ఏకాగ్రతతో ఉండడమే కాకుండా ప్రశాంతతను ఇవ్వడంలో యోగా ముందు ఉంటుందని తెలిపారు.విద్యార్థులు యోగ క్లాసులకు హాజరు కావలసిందిగా ఆమె పిలుపునిచ్చారు. కావున యోగా కోర్సు లో ఆసక్తి కలిగిన వారు తమ దరఖాస్తులను ఎయిమ్ రామాయోగ ట్రస్ట్, గీతా నిలయం, ఎదురుగా సమత బిల్డింగ్ వేద సమాజం వీధి,సాలూరు,మొబైల్ నెంబర్:9949348474 గల చిరునామాకు సంప్రదించవలసిన గా తెలియజేశారు. పట్టణ గ్రామీణ ప్రాంత యువత ప్రజలు యోగ పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ దంపతులకు రక్షాబంధన్

విశాలాంధ్ర -శృంగవరపుకోట: శృంగవరపుకోట బ్రహ్మకుమారిస్ ఆశ్రమం ఇన్చార్జి బి కే శైలజ సిస్టర్ రక్షాబంధన్ సందర్భంగా బొడ్డవరలోని ఇందుకూరి రఘురాజు స్వగృహంలో ఎమ్మెల్సీ దంపతులకు ఆదివారం రాఖీలు కట్టారు. రాఖీ యొక్క ఆధ్యాత్మిక రహస్యాన్ని సిస్టర్ బీకే శైలజ వివరించారు. బ్రహ్మకుమారీలకు ఎమ్మెల్సీ రఘురాజు దంపతులు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా జనసైనికులు సేవా కార్యక్రమాలు

విశాలాంధ్ర -పాచిపెంట: జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా వారం రోజులు పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జనసేన పార్టీ అభిమానులు కార్యకర్తలు అన్నారు జనసేన పార్టీ మండల అధ్యక్షులు జరజాపు ఉపేంద్ర మాట్లాడుతూ వైకాపాలనలో యువత ఉద్యోగ కల్పన లేదని ఎలాంటి ఉపాధి అవకాశాలు లేవని అన్నారు సెప్టెంబర్ 2న జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా ఈ వారం రోజులు పాటు సేవాకార్యక్రమాలు నిర్వహించేందుకు జనసేన పార్టీ అభిమానులు రౌతుమోహన్ అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు తర్వాత రోగులకు పండ్లు రొట్టెలు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

గూడ్స్ రైలు ఢీకొని శివాలయ అర్చకుడు మృతి

విశాలాంధ్ర -సీతానగరం: మండలం లోని కాశాపేట గ్రామసమీపంలో ఆదివారం ఉదయం ఆరుగంటల ప్రాంతంలో సీతానగరం నుండి బొబ్బిలికి వచ్చే అప్ లైన్ ట్రాక్ వద్ద గూడ్స్ రైలు ఢీకొని కాసాపేట గ్రామానికి చెందిన శివాలయ అర్చకుడు శంఖు శ్రీనివాసరావు(47) మృతి చెందాడు.బహిర్భూమి నిమిత్తం గ్రామ పరిసర ప్రాంతానికి దగ్గర్లో ఉన్న పద్మనాభం చెరువు వద్దకు కాలకృత్యాలు తీర్చికొనే నిమిత్తంవెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో పట్టాలు దాటుతుండగా అప్ లైన్ ట్రాక్ పై వస్తున్న గూడ్స్ ట్రైన్ రాకని గమనించకపోవడంతో ట్రైన్ ఢీకొనగా బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్యభారతి, ఒకఅమ్మాయి ఉన్నారు. శ్రీనివాసరావు మరణించిన ప్రదేశంవద్ద లభించిన సెల్ ఫోన్ ఆధారంగా మృతుని బంధువులకు సమాచారమిచ్చారు. కేసు నమోదు చేసి,మృత దేహాన్ని బొబ్బిలి కమ్యూనిటీ హాస్పిటల్ కి తరలించారు . అక్కడ శవపంచనామా నిర్వహించి, మృతదేహానికి పోస్ట్ మార్టం నిర్వహించి వారి బంధువులకి అప్పగించినట్లు బొబ్బిలి ఔట్ పోస్టు హెడ్ కానిస్టేబుల్ ఎస్.కృష్ణారావు తెలిపారు. బ్రతుకు తెరువు కోసం గ్రామానికి పదేళ్లక్రితం విచ్చేసిన శ్రీనివాసరావు స్థానిక శివాలయం లో అర్చకుడుగా ఉంటూ అందరి మన్ననలు పొంది బ్రతుకు సజావుగా జరుగుతున్న నేపథ్యంలో ఆదివారం మృతిచెందడం గ్రామస్తులందరితో పాటు చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలను కలచివేసింది. కుటుంబ యజమాని మృత్యువాత చెందారని తెలిసి అతని బార్య, కుమార్తె రోధనను ఆపడం ఎవరి తరం కాలేదు.

పేద విద్యార్థుల చదువుకు ప్రతి ఒక్కరు సహకారం అందించాలి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: పేద విద్యార్థుల చదువుకు ప్రతి ఒక్కరు సహకారం అందించాలని వసతి గృహ విశ్రాంత సంక్షేమ అధికారిణి ఆచంట విజయలక్ష్మి విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని 16 మంది అనాధ బాలికలను చదివించి, వారికి వివాహాలు జరిపించినందుకు గాను విశ్వ కళాపరిషత్, తిలక్ ఫౌండేషన్ సంస్థ ల ఆధ్వర్యంలో విశ్రాంత వార్డెన్ విజయలక్ష్మి కి ఆదివారం ఘనంగా సత్కారం జరిగింది. పట్టణంలోని కనపాక యూత్ హాస్టల్లో జరిగిన ఈ కార్యక్రమంలో సత్కార గ్రహీత విజయలక్ష్మి మాట్లాడుతూ పదేళ్ల క్రితం తాను సర్వీస్ లో ఉండగా తల్లిదండ్రులను కోల్పోయి అనాధలుగా తన వద్దకు వచ్చిన ఆడపిల్లలను చదివించి వారికి గత పదేళ్లుగా వివాహాలు చేయడం జరిగిందన్నారు. నందర్భంగా విశ్వకళా పరిషత్, తిలక్ ఫౌండేషన్ సంస్థ ల ప్రతినిధులు విజయలక్ష్మి ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కందాళ సాయిబాబా, చింతలపూడి త్రినాధరావు, బొడ్డేపల్లి రామకృష్ణ, జి.దయాకర్, నాగేశ్వరి, నీలాపు సంతోషిణి, ఆదుర్తి రామచంద్రావు, తదితరులు పాల్గొన్నారు.

ఎఎన్ఎమ్ ల పై పెరుగుతున్న పనిభారాన్ని తగ్గించాలి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : వైద్య ఆరోగ్య శాఖకు మూలస్థంబాలు గా పనిచేస్తున్న ఎఎన్ఎమ్ లు ప్రస్తుతం తీవ్ర పని ఒత్తిడి ఎదుర్కొంటున్నారని. కేవలం పదోతరగతి లేదా ఇంటర్మీడియట్ విద్యార్హతతో మాత్రమే ఉద్యోగాలు పొందిన వీరు నేడు వారి అర్హతకు మించిన బాధ్యతలను మోయ వలసిన దుస్థితిలో వున్నారని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.జగన్మోహన్ విచారం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక ఎపిఎన్జీఓ అసోసియేషన్ భవనంలో జరిగిన ఎఎన్ఎమ్ ల జిల్లా సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎఎన్ఎమ్ లు తమ రోజువారీ పనుల్లో భాగంగా దాదాపు 56 యాప్ లను ఉపయోగించి సమాచారాన్ని అప్లోడ్ చేయవలసి వస్తున్నదని, ఫలితంగా తీవ్ర వత్తిడికి గురవ్వడమే కాకుండా ఆరోగ్య పరమైన సమస్యలను సైతం ఎదుర్కోవలసి వస్తుందని అన్నారు. ఆ సంఘం జిల్లా కన్వీనర్ జివిఎస్ఎన్ మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో హెల్త్ సెక్రటరీస్ గ్రేడ్ 3 ఎఎన్ఎమ్ ల రాష్ట్ర అధ్యక్షులు ఎ.మాధవి, ఎపిఎన్జీఓ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వి. రమణ , యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుక్కల సత్యనారాయణ , కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు ప్రసంగించారు.

గడప గడపలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : నగరంలోని 27వ డివిజన్ 32వ సచివాలయ పరిధిలోని స్టేడియం పేట సమీపంలో బీసీ కాలనీ నుండి జరిగిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ లబ్ధిదారుల వివరాలతో కూడిన బుక్లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ దుప్పాడ సునీత మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రజల చెంతకు వెళుతుంటే అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. ప్రతి ఒక్కరికి ఏదో ఒక రూపంలో ప్రభుత్వ పథకాలు అందడంతో సంతోషం వ్యక్తం అవుతుంది అన్నారు. తమ డివిజన్లోని స్టేడియం పేట బీసీ కాలనీ ప్రాంతంలో ఇంటింటికి వెళ్లినప్పుడు స్థానికంగా కాలువ సమస్యను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి దృష్టికి తెచ్చారన్నారు. స్పందించిన ఆయన వెంటనే కాలువ సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సమస్య చెప్పిన వెంటనే పరిష్కారం దిశగా ఆయన చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. డివిజన్ అధ్యక్షుడు నాగబాబు మాట్లాడుతూ 27వ డివిజన్లో ఎన్నడూ లేనంత అభివృద్ధిని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నేతృత్వంలో జరిగిందన్నారు. గత 40 ఏళ్లుగా తీరని సమస్యగా ఉన్న ఇంటి మీద నుంచి విద్యుత్ వైర్లు వెళ్లే పరిస్థితిని పరిష్కరించి ప్రజలకు ఆనందాన్ని కలిగించారన్నారు. అలాగే 14 కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు అధికారులు ఆదేశించారన్నారు. 34 లక్షల రూపాయలతో మరుగుదొడ్ల నిర్మాణానికి ఆయన చూపిన చొరవ హర్షదాయకమన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి ,డిప్యూటీ మేయర్ లయ యాదవ్, సహాయ కమిషనర్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.